క్లుప్తంగా

సజ్జలతో నిజాం భేటీ



సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన షేక్ నిజాం

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ నిజాం గురువారం భేటీ అయ్యారు. తనను రాష్ట్ర పదవికి ఎంపిక చేయడంపై సజ్జలకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తోందని, వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు మైనార్టీలు కృషి చేయాలని ఆయనకు సజ్జల సూచించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కంబాలచెరువు: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 3వ వార్డు నెహ్రూనగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గురువారం మాస్టర్ తీడా రాము ఆధ్వర్యంలో యోగా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బళ్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులలో ఏకాగ్రత, ఆరోగ్యం పెంపొందించుటకు ఈ యోగా తరగతులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కేవీవీ సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.సత్యవేణి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



గాంధీపురం-2 స్కూల్లో విద్యార్థి చెవిని పరీక్షిస్తున్న డాక్టర్

కంబాలచెరువు: స్థానిక 8వ వార్డులోని గాంధీపురం – 2 నగరపాలక ఉన్నత పాఠశాలలో డాక్టర్ కర్రి రామారెడ్డి, డాక్టర్ గోలి రామారావు నిర్వహిస్తున్న ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు డాక్టర్ బత్తిబాబు దంత పరీక్షలు, డాక్టర్ సూర్య ప్రసాద్ స్కిన్, డాక్టర్ ప్రియ ఈఎన్‌టీ వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థకు విద్యార్థుల తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమాన్ని హెచ్ఎం ఆర్.సన్యాసిరావు, జాగృతి సత్యనారాయణ పర్యవేక్షించారు.

ఈవోపీఆర్డీగా విక్టర్ బాబు



విక్టర్‌బాబును అభినందిస్తున్న మండల పంచాయతీ కార్యదర్శులు

కడియం: ఈవోపీఆర్డీగా విక్టర్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏలూరు జిల్లా చింతలపూడి మండలం నుంచి బదిలీపై ఇక్కడికు వచ్చారు. కడియంలో సుమారు ఐదేళ్లు పనిచేసిన ఈవోపీఆర్డీ వైవీఎస్ఎస్ఎస్ లక్ష్మి చింతలపూడికి బదిలీపై వెళ్లారు. కాగా.. స్థానిక ఎంపీడీవో మనోజ్‌ను కలిసి విక్టర్ బాబు బాధ్యతలు స్వీకరించారు. ఆయనను మండల పంచాయతీ కార్యదర్శులు కలిసి అభినందనలు తెలిపారు.

సినిమాలు



శ్యామల	లాల్ సలామ్
సూర్యమినీ	ఈగల్
సూర్యప్యాలెస్	తేరా బాతోం మేరీ ఐసా
స్వామి	ఈగల్
శివజ్యోతి	
	అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
అనుశ్రీ	హనుమాన్
రాజా	ఈగల్
అశోక	ఈగల్
ఊర్వశి	యాత్ర-2
రంభ	ఈగల్
మేనక	నా సామిరంగ
అప్సర	గుంటూరుకారం
కుమారి	
	అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
నామవరం	
వీఎస్ మహల్	ఈగల్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	యాత్ర-2
కడియం	
వెంకటసూర్య	ఈగల్

మహిళల ఆర్థిక అభ్యున్నతికి ప్రాధాన్యం

- ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ భరత్‌రామ్
- ఘనంగా ఆసరా సంబరాలు



వైఎస్సార్ ఆసరా సంబరాల్లో మహిళలను సత్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్



అగ్నిప్రమాద బాధితుడికి సాయం అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో మహిళల ఆర్థిక అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ భరత్‌రామ్ అన్నారు. స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో గురువారం 33, 34, 40 డివిజన్ల లబ్ధిదారులతో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అర్హులైన పేదలకు వలంటీర్ల ద్వారా ఆర్థిక సాయం, సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గత టీడీపీ హయాంలో చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ, రైతు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు, నిరుద్యోగ భృతి ఇస్తానని ఆశ చూపి, తీరా అధికారంలోకి వచ్చాక అందర్నీ మోసం చేశారన్నారు. జగనన్నను మరోసారి సీఎం చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీ ప్రియ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను, పోలు విజయలక్ష్మి, ఏడీసీ సీహెచ్ సత్యవేణి, మిషన్ మేనేజర్ రవిశంకర్ పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

స్థానిక కంబాలపేటలో సంభవించిన అగ్ని ప్రమాదంలో పూరి గుడిసె కాలిపోయి నిరాశ్రయులైన బాధితులను ఎంపీ భరత్‌రామ్ గురువారం పరామర్శించారు. బాధితుడు జాలా సాయిప్రసాద్‌కు వైఎస్సార్ సీపీ తరఫున రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే రెవెన్యూ శాఖ తరఫున తక్షణ సహాయంగా రూ.5 వేలు, 25 కేజీల బియ్యాన్ని పంపిణీ చేశారు.

రెవెన్యూ అధికారులతో సమావేశం



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు: వచ్చే నెల తొమ్మిదో తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌పై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రెవెన్యూ, పంచాయతీ అధికారులతో ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత గురువారం సమావేశమయ్యారు. జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాల్సిన కేసులను గుర్తించి న్యాయసేవాధికార సంస్థకు అందజేయాలని సూచించారు. లోక్ అదాలత్‌తో పరిష్కారం పొందిన కేసులు కోర్టు ఫీజు చెల్లించనవసరం లేదన్నారు. అధిక కేసులు పరిష్కరించేందుకు అందరూ సహకారం అందజేయాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ న్యాయవాది సీహెచ్‌వీ ప్రసాద్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ సీపీఆర్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి సీఎం జగన్ కృషి



డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆరిఫ్ తదితరులు

సీటీఆర్ఐ: ముస్లింల సర్వతోముఖాభివృద్ధికి జగనన్న ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సమన్వయకర్త డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. వక్ఫ్ బోర్డ్ జిల్లా చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్లు గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ముస్లిం సంప్రదాయ పద్ధతిలో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం కోసం సీఎం జగన్ పని చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడి అబద్ధాలను, కుట్రలను సమర్థంగా తిప్పి కొట్టాలని, ముస్లింలందరూ వైఎస్సార్ సీపీ వెంట నడిచేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్లు మహమ్మద్ జఫరుల్లా ఖాన్, షేక్ ఇబ్రహీం, షేక్ అహ్మద్, షబ్బర్ బాషా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ ఆర్అండ్‌బీ వాంబే గృహాలు, రాజీవ్ గాంధీ కాలనీ, మున్సిపల్ కాలనీ, రత్నంపేట, కోరుకొండ రోడ్డు రాజా థియేటర్, పేపర్ మిల్ క్వార్టర్లు, సొసైటీ బిల్డింగ్‌లు, రాందాస్ పేట, గాదిరెడ్డి నగర్, ఇందిరా నగర్, శ్రీరామ్‌నగర్, దుర్గానగర్, మల్లయ్య పేట, శాంతి నగర్, వెంకట్ నగరం ఏరియాల్లో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని శాటిలైట్ సిటీ మెయిన్ రోడ్డు, ఏబీసీడీ బ్లాక్‌లు, రాజీవ్ గృహ కల్ప, ఇందిరమ్మ కాలనీ, పిల్లి సుబ్రహ్మణ్యం తోట, పిట్టలవాని చెరువు ఏరియా, సింగపూర్ సిటీ, అమరావతి లేఅవుట్, బుచ్చయ్య నగర్, శ్రీలక్ష్మి నగర్, సాయిబాబా పుంత ఇండస్ట్రియల్ ఏరియాలలో విద్యుత్ ఉండదు.
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సిటీలోని ఆల్ బ్యాంకు కాలనీ, మోడల్ కాలనీ, వీఎల్ పురం, సత్యనారాయణపురం, పెద్ద వీధి, శ్రీ నగర్ కాలనీ, తిలక్ రోడ్డు, కోనేరుపేట, సాయి బృందావన్ కాలనీ, మోరంపూడి సెంటర్, ఎం మార్బుల్ నేషనల్ హైవే ప్రాంతం, హోతా లేఅవుట్, మోరంపూడి, గణేష్ నగర్, మోరంపూడి సెంటర్, లాలాచెరువు ఏరియా, సుబ్బారావు పేట, నారాయణపురం, బాబా నగర్ , సైకిల్ కాలనీ, గాంధీపురం 4, వాంబే కాలనీ, ఏవీ అప్పారావు రోడ్డు, విద్యుత్ కాలనీ ఏరియా, స్వరూప నగర్, పోలీస్ క్వార్టర్స్ బ్యాక్ సైడ్ ఏరియాల్లో విద్యుత్ ఉండదు.

వారి నిజాయితీ అభినందనీయం



అప్పటి మేనేజర్ లక్ష్మీతులసిని అభినందిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కోళ్లబాబు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రూ.5 లక్షల విలువైన బంగారం వస్తువులను ఖాతాదారుడికి అప్పగించిన డీసీసీబీ బ్రాంచి మేనేజర్, స్వీపర్ నిజాయితీ వెలకట్టలేనిదని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. గురువారం స్థానిక శ్యామలా సెంటర్‌లోని డీసీసీబీ బ్రాంచి కార్యాలయంలో అప్పటి డీసీసీబీ మేనేజర్ జి.లక్ష్మీతులసి, స్వీపర్ మొండి సత్యవతిని ఆకుల వీర్రాజు, ఇన్నీసుపేట కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు (బాబు), డైరెక్టర్ల సమక్షంలో సత్కరించారు. ఆకుల వీర్రాజు మాట్లాడుతూ రాజమహేంద్రవరం డీసీసీబీ బ్రాంచిలో లాకర్ రూమ్‌ను 2023 అక్టోబర్ ఏడున స్వీపర్ మొండి సత్యవతి శుభ్రం చేస్తుండగా, రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాల ప్యాకెట్ దొరికిందన్నారు. ఆమె ఆ ప్యాకెట్‌ను నిజాయితీగా అప్పటి మేనేజర్ జి.లక్ష్మీతులసికి అందజేసిందన్నారు. ఆమె ఎంతో బాధ్యతగా వాటిని పోగొట్టుకున్న ఖాతాదారుడికి అందించిందన్నారు. కార్యక్రమంలో ఇన్నీసుపేట కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్లు, డీసీసీబీ బ్రాంచి మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

లెప్రసీ బాధితులకు ఉపకరణాల పంపిణీ



బాధితులకు వాకర్లు, హ్యాండ్ స్టిక్కులు అందజేస్తున్న డాక్టర్ వసుంధర

రాజమహేంద్రవరం రూరల్: అంగ వైకల్యంతో నడవడానికి ఇబ్బంది పడుతున్న లెప్రసీ బాధితులకు వాకర్లు, హ్యాండ్ స్టిక్కులు పంపిణీ చేశారు. బొమ్మూరులోని ఇవాంజిలికల్ హెల్పింగ్ హ్యాండ్ లెప్రసీ కాలనీలో గురువారం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ లెప్రసీ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వ్యాధిని తొలిదశలోనే తెలుసుకుని మందులు వాడటం వలన పూర్తిస్థాయిలో నివారించగలమన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓలు శివకుమార్, ఈశ్వరరావు, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు విజయలక్ష్మి పరామర్శ



మధురపూడిలో బాధితులను పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: నియోజకవర్గంలోని పలు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి గురువారం పరామర్శించారు. కోరుకొండ మండలం మధురపూడికి చెందిన కుప్పాల శ్రీను, మేర్ల గంగారత్నం, దాసి సుజీకుమారి ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా వారి కుటుంబాలను విజయలక్ష్మి పరామర్శించారు. రాజానగరం మండలం వెలుగుబందకు చెందిన కోలాటి సుబ్బారావు ఇటీవల ప్రమాదవశాత్తూ గాయాలపాలై చికిత్స పొందారు. ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. విజయలక్ష్మి వెంట మండలం కో కన్వీనర్ గణేశుల పోసయ్య, పార్టీ నాయకులు బత్తిన త్రిమూర్తులు, ఇండిగమెల్లి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కాళహస్తీశ్వర సిద్ధాంతికి సత్కారం



స్వర్ణసింహ తలాట సత్కారం అందుకుంటున్న కాళహస్తీశ్వర సిద్ధాంతి

కడియం: దుళ్ల గ్రామానికి చెందిన వాస్తు సిద్ధాంతి దొంతంశెట్టి కాళహస్తీశ్వరరావుకు స్వర్ణసింహ తలాట సత్కారం జరిగింది. ఇటీవల చీరలలోని సాయిబాబా కల్యాణ మండపంలో దేవబ్రాహ్మణ (దేవాంగ) అర్చక, పురోహిత, పండిత్ తృతీయ సర్వసభ్య సమావేశం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్రబాబు, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఆనంద ప్రసాద్, రాష్ట్ర దేవాంగ సంఘం ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ తదితరులు హాజరయ్యారు. కాళహస్తీశ్వర సిద్ధాంతి ఆధ్యాత్మిక, సాంస్కృతిక సేవలకు గాను స్వర్ణసింహ తలాట సత్కారం చేశారు.

ఎంపీడీవో రమేష్‌కు సన్మానం

సీతానగరం: ఇటీవల గోపాలపురం మండలానికి బదిలీ అయిన స్థానిక ఎంపీడీవో కె.రమేష్‌ను గురువారం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, ఏపీవో నాగేష వేణి, ఏవో గోపాల్, సీనియర్ అసిస్టెంట్ డి.విజయ్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ భరణి కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ సతీష్ తదితరులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కడియం: దుళ్ల గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను మండల స్థాయి అధికారులు గురువారం పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వీటిని సందర్శించి, ఆయా కేంద్రాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరిశీలించిన వారిలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో మనోజ్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ తులసీధర్ ఉన్నారు.

ఆక్రమణ భూముల స్వాధీనానికి యత్నం

సీటీఆర్ఐ: కోటిలింగాలపేటలోని శ్రీపందిరి మహదేవుడు సత్రానికి సంబంధించి ధవళేశ్వరం గ్రామంలో ఆక్రమణకు గురైన 2,821 చదరపు గజాల స్థలాన్ని గురువారం స్వాధీనానికి ప్రయత్నం చేసినట్లు సత్రం సహాయక కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.పళ్లంరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు తీర్పుననుసరించి ఆక్రమణకు గురైన భూములు స్వాధీనం చేసుకోవడానికి రెవెన్యూ సిబ్బంది, పోలీసులతో కలిసి వెళ్లగా ఆక్రమణదారులు ప్రతిఘటించారన్నారు. అయితే మరో తేదీన స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖాధికారి వి.సోమరాజు, పర్యవేక్షకులు డి.సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భలే ‘మంచు’రోజు



ఆర్ట్స్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మంచు పరదా



సెంట్రల్ జైలు సమీపంలో కానరాని రోడ్డు



ఆర్ట్స్ కళాశాల మెయిన్ గేట్ వద్ద కమ్ముకున్న మంచు

సీటీఆర్ఐ: శీతాకాలంలో వేకువజామున మంచు కురవడం సహజమే. దానికి భిన్నంగా గురువారం ఉదయం 7.30 ప్రాంతంలో ఒక్కసారిగా పొగమంచు నగరాన్ని కమ్మేసింది. రోడ్డుపై వెళ్లే వాహనాలు కానీ, మనుషులు కానీ కనిపించని పరిస్థితి ఏర్పడింది. సెంట్రల్ జైలు రోడ్డులో దారి కనబడకపోవడంతో వాహనాలను కొద్దిసేపు ఆపేశారు. పొగమంచు తగ్గిన తర్వాత ముందుకు సాగారు. దేవీచౌక్, కంబాలచెరువు ప్రాంతాల్లో మంచు తీవ్రత అధికంగా ఉంది.

చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కొరడా



వివరాలను వెల్లడిస్తున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ తులసీధర్

కడియం: మండలం పరిధిలో జరుగుతున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ కొరడా ఝుళిపించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంతో ఈ వివరాలు వెల్లడించారు. దుళ్ల – మురమండ పుంత రోడ్డులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.16,240, ఎనిమిది సెల్‌ఫోన్లు, నాలుగు మోటారు సైకిళ్లు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. కడియంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న పరదక్షిణ వెంకన్నను అదుపులోకి తీసుకుని, అతడి నుంచి రూ.1200 విలువైన 9 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే దుళ్ల గ్రామానికి చెందిన కె.ఈశ్వరి తన భర్త ఇంట్లో గొడవ పడి వెళ్లిపోయాడని ఇటీవల ఫిర్యాదు చేశారు. విశాఖలో ఉంటున్న అతడిని గుర్తించి, తీసుకువచ్చి భార్యకు అప్పగించారు. సమావేశంలో ఎస్ఐ అష్ఫక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీ సందర్శన

కడియం: ప్రముఖ సినీనటుడు శ్రవణ్ రాఘవేంద్ర బుధవారం కడియం పల్ల వెంకన్న నర్సరీని సందర్శించారు. ఆయనకు నర్సరీ డైరెక్టర్ పల్ల వినయ్ ఘన స్వాగతం పలికారు. వివిధ రకాల మొక్కలను గురించి వివరించారు. మిత్ర బృందంతో కలిసి విచ్చేసిన శ్రవణ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ, విదేశీ మొక్కలతో కడియం ప్రాంత నర్సరీలు అద్భుతంగా ఉన్నాయన్నారు. విశేషంగా నర్సరీని అభివృద్ధి చేసిన పల్ల వెంకన్న నర్సరీ రైతులను అభినందించారు.

డ్రైవర్లకు అవగాహన

రాజమహేంద్రవరం సిటీ: విధి నిర్వహణలో డ్రైవర్లు నిబద్ధతతో పనిచేస్తూ, తమ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సబిత, సాయికుమార్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం రాజమహేంద్రవరం డిపోలో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారులపై ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి కె.షర్మిల అశోక, డిపో మేనేజర్ ఎస్కే షబ్నం పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ప్రకాశం నగర్: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళంలో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని ఏపీఎస్‌పీఎఫ్ దళాధిపతి ఎం.త్రివిక్ర వర్మ అన్నారు. గత నెలలో నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగిన ఏపీఎస్‌పీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రాజమహేంద్రవరం జోన్‌కు చెందిన వాలీబాల్ జట్టు ప్రథమస్థానం సాధించడంతో రాజమహేంద్రవరం జోన్ కమాండెంట్‌ను అభినందించారు. విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో గురువారం వివిధ జోన్ల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ప్రోత్సాహకంగా క్రీడా కిట్లు పంపిణీ చేశారు.

ఎలక్ట్రికల్ కార్మికులు అప్రమత్తంగా ఉండాలి



నగదు అందజేస్తున్న బొజ్జ రామకృష్ణ తదితరులు

సీటీఆర్ఐ: ఎలక్ట్రికల్ కార్మికులు పనిలో అప్రమత్తంగా ఉండాలని గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ అన్నారు. ఈ సంఘ సభ్యుడు జక్కంశెట్టి రవి ఎలక్ట్రికల్ పనిచేస్తూ ప్రమాదశాత్తూ గాయపడ్డాడు. అతడికి బిల్డర్ ఓబుల్ రెడ్డి, ఎలక్ట్రిషన్ కాంట్రాక్టర్ శ్రీనివాస్ కలిపి ఇచ్చిన రూ.2.50 లక్షలను గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి గోవాడ కొండబాబు, కోశాధికారి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.